ప్రజాశక్తి

గురువారం 12 అక్టోబర్ 2023

5

అల్లూరి సీతారామరాజు

టూరిజం కార్మికుల సమ్మె నోటీసు

ప్రజాశక్తి -అనంతగిరి:ప్రముఖ పర్యాటక శాఖ అతిథి గృహాల్లో పని చేస్తున్న కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని కోరుతూ జిల్లా యూనియన్ పిలుపు మేరకు అనంతగిరి, బొర్రా, టైడ, అరకు శాఖాలలో పని చేస్తున్న కార్మికులు ఉమ్మడి జిల్లా రీజినల్ మేనేజర్, స్థానిక యూనిట్ల మేనేజర్లకు కలిసి లిఖితపూర్వకంగా సమ్మె నోటీసులు అందజేశారు.ఈ సందర్భంగా కార్మిక యూనియన్ ప్రతినిధులు రాజు, ముదిరాజు మాట్లాడుతూ, ప్రముఖ పర్యాటక శాఖలలో సంవత్సరాల తరబడి పని చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో టూరిజం శాఖ ఆరు రకాల ఒప్పందాలను తక్షణమే పరిష్కారం చేయాలని కోరుతూ ఈనెల 22వ తేదీ నుండి సమ్మె బాట చేపట్టడం జరుగుతుందని వారు స్పష్టం చేశారు.

నోటీసు ఇస్తున్న కార్మికులు

కాల పరిమితి సర్క్యులర్ రద్దు చేసే వరకూ

పోరాటం ఆగదు

-మన్యంలో విఓఎల ఉద్యమం ఉధృతం

-పాడేరు కలెక్టరేట్ వద్ద బైఠాయింపు

- చింతూరు, రంపచోడవరంల్లో ధర్నాలు

పాడేరులో కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన విఓఎలు

ప్రజాశక్తి -యంత్రాంగం: తమ సమస్యలు పరిష్కరించాలని, కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ విఓఎలు చేపట్టిన ఆందోళన బుధవారం ఉధృతం చేశారు. పాడేరులో కలెక్టరేట్ వద్ద బైఠాయించారు. చింతూరు, రంపచోడవరంలో ధర్నాలు చేపట్టారు.

పాడేరు :

పాడేరు ఐటిడిఏ ఎదుట మంగళవారం 36 గంటల నిరవధిక ధర్నా చేపట్టిన వెలుగు వివోఏలు రెండో రోజు బుధవారం కలెక్టరేట్ ముట్టడి నిర్వహించారు. ధర్నా శిబిరం నుంచి వివోఏలు భారీ ర్యాలీగా కలెక్టరేట్‌కు తరలి వెళ్లారు. కలెక్టర్ కార్యాలయం గేటు ముందు బైఠాయించిన వివోఏలు నిరసన గళంతో తమ సమస్యలపై నినదించారు. వెలుగు ఏపీడిని వివోఏలు నిలదీశారు. తమ సమస్యల పరిష్కారం పట్ల అధికారులు నిర్లక్ష్యం వహించారని పైగా విధి నిర్వహణలో తమకు ఇబ్బందులు సృష్టిస్తున్నారంటూ తమ సమస్యల్ని ఏకరువు పెట్టారు. వివిధ మండలాల నుంచి వచ్చిన వివోఏల నిరసనలతో కలెక్టరేట్ ప్రాంగణం మార్మోగింది.

సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ,ప్రభుత్వం దిగి వచ్చి సమస్యలు పరిష్కరించకుంటే మనమే ప్రభుత్వాన్ని గద్దె దించుదామని, ఆరు నెలల్లో ఎన్నికలు రాబో తున్నాయని సమస్య పరిష్కారం చేసేంత వరకు వెలుగు వివోఏల పోరాటం ఆపేది లేదన్నారు. విఓఎల సమస్యలను తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారం చేయాలని, 36 గంటల ఐటిడీఏ ముందు వంటావార్పు చేసినా ప్రభుత్వం స్పందించక పోవడం దుర్మార్గమన్నారు. వివోఏ లతో వెట్టి చాకిరి చేయించుకుంటున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం కాలపరిమితి సర్క్యులర్‌ను వెంటనే రద్దు చేయాలని, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, పది లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. బకాయి పడ్డ జీతాలు చెల్లించి, కార్మికుల కనీస వేతనాలు 26,000 అమలు చేయాలన్నారు. అధికారుల వేధింపులు వెంటనే ఆపి, అనారోగ్యంతో ఉన్న వివోఏల కుటుంబాలకు ఉపాధి అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. స్థానిక ఏపీఎం, సీసీలు వేధింపులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు.

స్పందించిన వెలుగు ఏపిడి మురళి బయటకు వచ్చి వివోఏల నుంచి సమస్యలపై వినతి పత్రం తీసుకొని పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తానని వివరించారు. ఏపీఎంలు, సీసీలు వేధింపుల పై స్పందించిన పీడీ శాఖపరమైన చర్యలు తీసుకుంటామని వ్యక్తిగతంగా తమకు ఫోన్ చేసి చెప్పాలని సూచించారు. కలెక్టర్ ప్రాంగణంలో ఉన్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మిని బయటికి వచ్చి తమ సమస్య పై మాట్లాడాలని డిమాండ్ చేయగా రాష్ట్రవ్యాప్త ఉద్యమం కాబట్టి ప్రభుత్వం దృష్టికి తాను తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వెలుగు వివోఏల సంఘం అధ్యక్ష కార్యదర్శులు భాను,.రవి కుమార్, శేఖర్, ఎల్ సుందర్రావు, జిల్లా నుంచి పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కొనసాగిన విఒఎల నిరసన దీక్ష

చింతూరు : సమస్యల పరిష్కారానికి వెలుగు విఒఎల 36గంటల మహాధర్నాను చింతూరు ఐటిడిఎ ఎదుట కొనసాగించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కొమరం పెంటయ్య మాట్లాడుతూ మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్ రద్దు, హెచ్‌ఆర్ పాలసీ అమలు, గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పన, పెండింగ్ వేతనాలు చెల్లింపు వంటి డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. లోకో యాప్ నిర్వహణకు 5జి ఫోన్‌లు ఇవ్వాలని, రూ.10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. అనంతరం డిమాండ్స్‌తో కూడిన వినతిపత్రాన్ని ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరేకు అందించారు. కార్యక్రమంలో లీలా, రత్నకుమారి, జ్యోతి, మణి, కుమారి, వెంకటరమణ, లక్ష్మి, రాము, రామకృష్ణ, సీత పాల్గొన్నారు

రంపచోడవరం : వెలుగు విఒఎ(యానిమేటర్స్) 36 గంటల ధర్నాలో భాగంగా రెండవరోజు బుధవారం వంటావార్పు నిరసన చేపట్టారు. ఏడు మండలాలకు చెందిన300 మందికి పైగా విఒఎలు పాల్గొని, రోడ్డుపైనే వండి, భోజనాలు చేశారు. అనంతరం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు.వెంకట్, జిల్లా అధ్యక్షులు మట్ల వాణిశ్రీ మాట్లాడుతూ విఒఎలకు ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన హామీని నాలుగున్నరేళ్లుగా నిర్లక్ష్యం చేశారని, ఇప్పటికైనా స్పందించకుంటే తగు గుణపాఠం తప్పదని హెచ్చరించారు. తక్షణం స్పందించకుంటే చలో విజయవాడ ఆందోళన, నిరవధిక సమ్మెకు వెనకాడబోమని హెచ్చరించారు. కె.ఎర్రంపాలెం విఒఎ వెంకటలక్ష్మిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఐటిడిఎ ఎఒకు అందజేశారు.

చింతూరులో ధర్నా చేపడుతున్న విఒఎలు

రంపచోడవరంలో నిరసన తెలుపుతున్న విఒఎలు

సమస్యలను పరిష్కరించాలి

హుకుంపేట:విఒఎల సమస్యలు పరిష్కరించాలని, మూడు సంవత్సరాల కాల పరిమతి సర్క్యులర్‌ను వెనక్కి తీసుకోవాలని అల్లూరి జిల్లా గిరిజన మహిళా సంఘం జిల్లా కార్యదర్శి టి.కౌసల్య, ఎస్.హైమావతి డిమాండ్ చేశారు. వివో ఏలను మానసికంగా ఒత్తిడి చేయరాదన్నారు. విఒఎల నిరసన కార్యక్రమాలకు గిరిజన మహిళా సంఘం పూర్తి మద్దతు తెలియజేస్తుందన్నారు.

సిపిఎం మద్దతు

పాడేరు:రాష్ట్రవ్యాప్తంగా వెలుగు విఒఎలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రెండు రోజులుగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం మొండి వైఖరి అవలంభించిందని సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి అప్పలనర్స విమర్శించారు. పాడేరు ఐటీడీఏ ఎదుట వెలుగు విఒఎ, (సిఐటియు), మెప్మా ఆర్‌పిల సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన 36 గంటల ధర్నా, వంటావార్పు కార్యక్రమానికి బుధవారం ఆయన హాజరై మద్దతు తెలిపారు. ఈ ధర్నా శిబిరాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, వెలుగు ఉద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం కర్కశంగా వ్యవహరిస్తుందని, 36 గంటల పాటు నిరసన చేసినా కనీసం స్పందించక పోవడం దారుణమన్నారు. వైసిపిని గెలిపిస్తే వెలుగు ఉద్యోగుల జీవితాల్లో వెలుగు నింపుతానని చెప్పి గెలిచాక వెలుగు కాదు కదా వారి బతుకులు చీకట్లో నిరసన చేసేలా రోడ్లపైకి ఈడ్చిందని విమర్శించారు.వెలుగు ఉద్యోగుల మూడేళ్ల కాల పరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని, గ్రేడింగ్ పద్ధతి వెనక్కి తీసుకోవాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఛలో అసెంబ్లీ, సీఎం జగన్ మోహన్ రెడ్డి ఇండ్ల ముట్టడికి కూడా వెలుగు ఉద్యోగులు సిద్ధమవుతారని హెచ్చరించారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నేత వెంకట్

ప్రజాశక్తి - మోతుగూడెం : కనీస వేతనాలు అమలు, ఇతర సమస్యల పరిష్కారానికి డొంకరాయి కార్మికులంతా సంఘటితంగా పోరాటాన్ని ఉధృతం చేయాల్సిన అవసరం ఉందని, అపుడే ప్రభుత్వాన్ని కదలించగలమని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ అన్నారు. బుధవారం డొంకరాయిలోకార్మికుల సమావేశంలో. వెంకట్ మాట్లాడుతూ కార్మికులను శ్రమదోపిడీ గురిచేయడంలో వైసిపి ప్రభుత్వం మొదటి స్థానంలో వుందని విమర్శించారు. గడిచిన నాలుగున్నర ఏళ్లలో కార్మికులకు జీతాలు పెంచకుండా, కార్మికుల సంక్షేమాన్ని గాలికొదిలేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారం కోసం రోడ్డెక్కితే అరెస్టులు, నిర్బంధాలతో నియంతలా వ్యవహరిస్తున్నారన్నారు.సీనియర్ నాయకులు ఎర్రంశెట్టి. శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామాలలో వున్న వ్యవసాయ కూలీల సమస్యలపై అధ్యయనం చేసి, వాటి పరిష్కారానికి పోరాటాలలో వారిని భాగస్వామ్యం చేయాలని అన్నారు. వైసిపి ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో సుబ్బారావు, నూకరారత్నం నాగమణి, నర్సమ్మ, బుల్లెమ్మ, పార్వతి, సజిత, బుజ్జినాని, మితుల, లలిత, విమల, సన్యాసమ్మ, పూర్ణిమ పాల్గొన్నారు

వాలంటీరు అరెస్టుపై ఎంపిడిఒ విచారణ

విచారణ చేస్తున్న ఎంపిడిఒ ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం సీలేరు మేజర్ పంచాయతీ చింతపల్లి క్యాంపునకు చెందిన వాలంటీర్ జగ్గారావును పోలీసులు అరెస్ట్ చేయడంపై బుధవారం స్థానిక సచివాలయంలో ప్రజాప్రతినిధులు సమక్షంలో జికే వీధి ఎంపిడిఒ ఉమామహేశ్వరరావు విచారణ చేపట్టారు. కుటుంబసభ్యులు సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటిడిఎ పిఒ అభిషేక్ ఆదేశాలతో విచారణ చేపట్టి, వాంగ్మూలాలను నమోదు చేసుకున్నారు. అనంతరం స్థానిక విలేకరులతో ఎంపిడిఒ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, తమ విచారణలో వివిధ అంశాలు వెలుగులోకి వచ్చాయన్నారు. వాలంటీరు జగ్గారావు నేరస్తుడని పోలీసులు వెల్లడించారన్నారు.

జగ్గారావు ఇంట్లో ఎవరూ లేని సమయంలో సచివాలయ మహిళా కానిస్టేబుల్ రేవతి అతని ఆధార్ కార్డు తీసుకువెళ్లి పోలీసులకు అందజేసిందని ఫిర్యాదు చేశారని, దానిపై కూడా పూర్తిస్థాయి విచారణ చేశామని ఎంపిడిఒ తెలిపారు. తుది నివేదికను ఉన్నతాధికారులకు అధికారులకు అందజేస్తామన్నారు. సచివాలయ సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి పిల్ల సాంబమూర్తి, సర్పంచ్ దుర్జో, ఉప సర్పంచి కె.వల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్

జిల్లాకు 9,640 ఓటింగ్ యంత్రాలు

- కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాకు 9,640 ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్ర పరికరాలు వచ్చాయని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు.. కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈవిఎంలను డిగ్రీ కాలేజి సమీపంలో కట్టుదిట్టమైన భద్రతతో గొడౌన్లో భద్రపరిచామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 3700 బ్యాలెట్ యూనిట్లు, 2640 కంట్రోల్ యూనిట్లు, 3100 వివిపాట్లు వచ్చాయని చెప్పారు. అన్నింటిని క్షుణ్ణంగా తనిఖీ చేసామని చెప్పారు. వీటిలో 36 సక్రమంగా పనిచేయ లేదన్నారు. ఈనెల 16వ తేదీన మరొక సారి పరిశీలిస్తామని, రాజకీయ పార్టీల నేతలు పాల్గొన వచ్చన్నారు. ఈవిఎం ఓటింగ్ యంత్రాలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. జిల్లాలో ఉన్న మూడు నియోజక వర్గాల్లో 1021 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసామన్నారు. పాత పోలింగ్ కేంద్రాలు 1008 ఉన్నాయని కొత్తగా 13 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 1021 పోలింగ్ కేంద్రాలలో 3,54,225 మంది పురుషుల ఓటర్లు, 3,80,213 మంది మహిళా ఓటర్లు, 34 మంది ట్రాన్స్ జెండర్ల ఓటర్లు ఉన్నారన్నారు. 40 వేల మంది శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్లు, 24 వేల మృతి చెందిన ఓటర్లను ఓటరు జాబితా నుండి తొలగించామని పేర్కొన్నారు. 27,737 ఫారం 6, 25,427 ఫారం 7,51,197 ఫారం 8లను సేకరించామని చెప్పారు. ఈ సమావేశంలో పాడేరు శాసన సభ్యురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, డి.ఆర్.ఓ.పి. అంబేద్కర్, వివిధ పార్టీల నేతలు పాల్గొన్నారు.

13న జి.మాడుగులలో స్పందన

ప్రజాశక్తి -పాడేరు: ఈనెల 13 వ తేదీ శుక్రవారం జి.మాడుగులలో జగనన్నకు చెబుదాం ప్రత్యేక స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ప్రకటించారు. జి. మాడుగుల ఎంపిడిఓ కార్యాలయంలో నిర్వహించే స్పందనకు జిల్లా అధికారులు విధిగా హాజరు కావాలని ఆదేశించారు. స్పందన కార్యక్రమం ఉదయం 10 గంటలకు ప్రారంభం అవుతుందని స్పష్టం చేశారు. అనంతరం శాఖాధికారులు సంబంధిత క్షేత్ర స్థాయి సిబ్బందితో సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. జి.మాడుగులలో స్పందన ఉన్నందున పాడేరులో స్పందన రద్దు చేయడం జరిగిందని, ప్రజలు గమనించి పాడేరు లో స్పందనకు రావద్దని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

గుంటసీమలో గడప గడపకూ..

ప్రజాశక్తి-దుంబ్రిగుడ:మండలంలోని గుంటసీమలో స్థానిక అరకు ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణ ఆధ్వర్యంలో బుధవారం గడపగడపకు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ గ్రామంలోని ప్రతి గడపగడపకు తిరుగుతూ వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలపై కరపత్రాలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, వైసిపి ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసమే ఆలోచిస్తూ పథకాలను అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బి ఈశ్వరి, జెడ్పిటిసి సిహెచ్ జానకమ్మ, స్థానిక సర్పంచ్ బి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.



బుక్‌లెట్‌ను ఇస్తున్న ఎమ్మెల్యే

15న ఆదివాసీ అరణ్యఘోష బహిరంగ సభ జయప్రదానికి

సిపిఎం విస్తృత ప్రచారం

రాజవొమ్మంగిలో కరపత్రాలు పంచుతూ ప్రచారం చేస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి- రాజవొమ్మంగి: ఈనెల 15న సిపిఎం ఆధ్వర్యంలో రంపచోడవరంలో జరిగే ఆదివాసీ అరణ్య ఘోష బహిరంగ సభను ప్రజలు విజయవంతం చేయాలని బుధవారం మండలంలో సిపిఎం నేతలు విస్తృత ప్రచారం నిర్వహించారు, బహిరంగ సభ కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. మండలంలోని చికిలింత, లోదొడ్డి, వంచంగి, వాతంగి, మారేడుబాక, రాజవొమ్మంగి తదితర పంచాయతీల గ్రామాల్లో సిపిఎం, ఆదివాసీ గిరిజనసంఘం నేతలు గ్రామసభలు నిర్వహించి బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. రంపచోడవరం కేంద్రంగా మరో ఏజెన్సీ జిల్లాను ఏర్పాటు చేయాలని, పోలవరం నిర్వాసితులందరికీ పరిహారం చెల్లించాలని, ఆదివాసీస్పెషల్ డిఎస్‌సి ప్రకటించాలని, జిఒ 3 పునరుద్ధరించాలని, మన్యంలో కనీస మౌలిక సదుపాయాలను కల్పించాలని డిమాండ్‌తో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లోతా రామారావు,సీపీఎం నేతలు తెడ్ల అబ్బాయి,కొండ్ల సూరిబాబు,కె రాజు, పాండవుల సత్యనారాయణ, రామరాజు,జె రాజు,పి సత్యనారాయణ, చిన్నారావు,ఎం రమేష్,కె జగన్నాథం పాల్గొన్నారు.

విఆర్.పురం: ఈనెల15న రంపచోడవరం జరిగే భారీ బహిరంగసభను జయప్రదం చేయాలని సిపిఎం నేతలు కోరారు. . బుధవారం కన్నయ్య గూడెం నాగేంద్రపురం కొండ గుంపు కుసుమామిడి సున్నం మట్కా గ్రామాల్లో విస్తృత ప్రచారం చేశారు. సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, మాట్లాడుతూ పోలవరం పోరుకేక పాదయాత్రలో 14 రోజులపాటు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు నాయకత్వంలో నిర్వహించిన పాదయాత్ర పోరాట ఫలితంగా నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించినప్పటికీ ఆచరణలో తీవ్రమైన జాప్యం చేస్తోందన్నారు. జిఒ 3 పునరుద్ధరణ, స్పెషల్‌మెగా డిఎస్‌సి ప్రకటన, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మోడీ భజనలో తరిస్తూ, అడవి సంపదను కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టడానికి మోడీ ప్రభుత్వం నిర్ణయిస్తే, జగన్ ప్రభుత్వం దాసోహమంటూ అమలు చేయడం దారుణమన్నారు. ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ రద్దు, స్టీల్‌ప్లాంట్‌వంటి ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవడం వంటి సమస్యలపై ఈ ఆదివాసీ అరణ్యఘోష సభ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.కార్యక్రమంలో పంకు .సత్తిబాబు గూటాల. శ్రీను సోడి మల్లయ్య ప్రకాష్ పాల్గొన్నారు.

అడ్డతీగల : ఆదివాసీ అరణ్య ఘోష బహిరంగ సభను విజయవంతం చేయాలని స్థానిక మండల కేంద్రంలో సిపిఎం ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. రంపచోడవరం జిల్లా కేంద్రంగా మరో ఏజెన్సీ జిల్లాను ఏర్పాటు చేయాలని ,పోలవరం నిరాసితులందరికీ 2013 చట్టప్రకారం పునరావసం పరిహారం ఇవ్వాలని, పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, జీడిమామిడి పిక్కలు పరిశ్రమల ఏర్పాటు, రోడ్లు, మంచినీటి, సౌకర్యం కల్పించాలని కోరారు ఆసుపత్రుల్లో సిబ్బంది, మందుల కొరత నివారించాలని కోరారు. రాజవొమ్మంగి, జడ్డంగి, చెరుకుంపాలెం, కోనలోవ, అడ్డతీగల మీదుగా ర్యాలీ చేశారు.1



అడ్డతీగలలో బైక్‌ర్యాలీ చేస్తూ ప్రచారంలో సిపిఎం నేతలు

కృపమ్మ కుటుంబానికి న్యాయం చేయాలి

పిహెచ్‌సి వద్ద ఆశావర్కర్ల నిరసన



ఆందోళన చేస్తున్న ఆశావర్కర్లు

ప్రజాశక్తి -అడ్డతీగల : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో విధి నిర్వహణలో ఉంటుండగానే మృతి చెందిన గుంటూరు జిల్లా ఆశావర్కర్ కృపమ్మ కుటుంబానికి న్యాయం చేయాలని, ఆమె మృతికి కారణమైన వైద్యాధికారి, హెచ్‌విలపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఆశావర్కర్లు డిమాండ్ చేశారు. వై.రామవరం మండలం చవిటిదిబ్బల పిహెచ్‌సి వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశావర్కర్లు యూనియన్ మండల నాయకురాలు కె.వీరలక్ష్మి నాయకత్వంలో నిరసన చేపట్టారు.

ఈ సందర్భంగా వీరలక్ష్మి మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం కోసం 15 రోజులుగా ఇంటింటి సర్వేకు ఒత్తిడి చేయడం వల్లే తీవ్ర పనిఒత్తిడితో ఆశావర్కర్ కృపమ్మ అస్వస్థతకు గురై కళ్ళు తిరిగి అక్కడే ప్రాణాలు కోల్పోయిందన్నారు. అస్వస్థతకు గురైన సమయంలో అక్కడున్న వైద్య సిబ్బంది ప్రాణాలు కాపాడే ప్రయత్నం చేయకపోవడం బాధాకరమ న్నారు. సిబ్బంది .ప్రాణాలు కాపాడలేని జగనన్న ఆరోగ్య సురక్ష పథకం, ఇంకా ప్రజల ప్రాణాలకు ఎలా భరోసానిస్తుందని ప్రశ్నించారు. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనన్నారు.

చనిపోయిన ఆశావర్కర్ కృపమ్మ కుటుంబానికి రూ.50 లక్షలు నష్టపరిహారం, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. అలాగే ఆశాలను పర్మినెంట్ చేసి, వారి ఉద్యోగాలకు భరోసా కల్పించాలని, పనిఒత్తిడి, రాజకీయ వేధింపులు నివారించాలని కోరారు. కార్యక్రమంలో పి.శ్యామల,జె.తులసి,డి మరియమ్మ, జె.దండమ్మ, తదితరులు పాల్గొన్నారు.

బూత్ ఏజెంట్ల నియామకానికి చర్యలు

ప్రజాశక్తి -కొయ్యూరు : రాబోయే సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టు కుని పాడేరు నియోజకవర్గం కొయ్యూరు మండలంలో బూత్ ఏజెంట్లను నియమిస్తున్నట్లు నియోజక వర్గ ఇన్‌ఛార్జి వొంపురి. గంగులయ్య తెలిపారు. బుధవారం మంప. రేవళ్లు, కొయ్యూరు, రాజేంద్రపాలెం, మర్రివాడ, చింతలపూడి, రావణపెల్లి.పంచాయతీల్లో పర్యటించారు. ప్రజల సమస్యలు తెలుసుకోవడంతోపాటు జనసేన సిద్ధాంతాలు, విధానాలను వివరించారు. జనసేన ముద్రించిన 'ఈ ప్రశ్నలకు బదులేది' కరపత్రాలను పంపిణీ చేశారు. ఎనిమిది మంది తాత్కాలిక కన్వీనర్లు ,కో కన్వీనర్లను నియమించారు. మిగతా పంచాయతీల్లోనూ నియామకానికి చర్యలు చేపడతామనానరు. జనసేన మండల అధ్యక్షుడు గూడెం లక్ష్మణ్, తాత్కాలిక బూత్ కన్వీనర్ సాగిన బుజ్జిబాబు, కోకన్వీనర్లు పుర రాజేష్, నివాస్ ఖుషి, పిట్టా సుధీర్ బాబు, సిద్ధు, కారంగి నవీన్ కుమార్ బెనుకుల, లోవరాజు, కాకర, కుమార్,.మహేంద్ర, నాగేంద్ర పాల్గొన్నారు.

గ్రామాల్లో పర్యటిస్తున్న జనసేన నేతలు

సమస్యల పరిష్కారానికి వినతి



ఐటిడిఎ పిఒకు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి-కూనవరం: మండలంలోని సమస్యలు పరిష్కరించాలని సిపిఎం నేతలు కోరారు. ఈమేరకు ఐటిడిఎ పిఒకు వినతిపత్రం అందజేశారు అన్ని గ్రామాల్లో వున్న చెరువులు మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని, కూనవరం సిహెచ్‌సిలో డాక్టర్స్‌ను నియమించాలని, కూటూరు లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి కొత్త మోటార్స్ మంజూరు చేయాలని, కూటూరు పాఠశాలలకు ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలని, కూటూరు సంతలో షెడ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టాని, శబరినది వద్ద కూటూరు ఎత్తిపోతల పథకానికి రెండవ విద్యుత్ కనెక్షన్‌కు అనుమతి ఇవ్వాలని, గండి కొత్తగూడెం రోడ్డుకు తారురోడ్డుగా మార్చాలని కోరారు. శిథిలావస్థలో ఉన్న పలు భవనాలను పునర్నిర్మించాలని కోరారు. పిఒను కలిసి వినతిపత్రం అందించిన వారిలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు, మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య, సర్పంచులు బొగ్గా వెంకమ్మ, నాగమణి, సుబ్బయ్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

రీ సర్వే వేగవంతం చేయండి : కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలో చేపట్టిన రీ-సర్వే పనులు వేగవంతం చేయాలని నిర్దేశిత లక్ష్యాల ప్రకారం లక్ష్య సాధనలో చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తహసీల్దార్లను, సబ్ కలెక్టర్లను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుండి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ, రీ- సర్వే వేగ వంతానికి సబ్ కలెక్టర్లు నిరంతర పర్యవేక్షణ జరపాలని, వారి లాగ్ ఇన్‌లోకి వచ్చిన వాటిని పరిశీలించి ఆమోదించాలని ఆదేశించారు. రానున్న ఐదు రోజులలో పెండింగ్ లో ఉన్న వాటిని పూర్తి చేయాలన్నారు. పాడేరు డివిజన్ లో 30 గ్రామాల రి-సర్వే లాగిన్ లో పెండింగ్ ఉన్నందున సోమవారం నాటికి తహసీల్దార్ లాగిన్‌కు పంపాలని, అందులో కనీసం 14 గ్రామాల వివరాలను సబ్ కలెక్టర్ లాగిన్ కు పంపాలని ఆదేశించారు. అందుకు సంబంధించిన ఫారం 4,8 లను పెండింగ్ లో లేకుండా చూడాలన్నారు. ప్రజలకు అవసరమైన ధ్రువపత్రాల జారీలో తాత్సారం వహిస్తున్న తహసీల్దార్లపై కలెక్టర్ సీరియస్ అయ్యారు. ఫ్యామిలీ మెంబర్, ఇన్కం, ఇంటిగ్రేటెడ్ ధ్రువపత్రాల జారీలో ఎందుకు ఆలస్యం చేస్తున్నారని ప్రశ్నించారు. అందుకు సంబంధించిన సబ్ కలెక్టర్లు బాధ్యత వహించాలని ఆదేశించారు. అదేవిధంగా లేట్ బర్త్ రిజిస్ట్రేషన్ పై కూడా చర్యలు తీసుకొని త్వరగా ధ్రువపత్రాలు జారీ చేయాలని ఆదేశించారు. ఓటర్ జాబితా సవరణ ప్రక్రియాగమంతం చేయాలని, గూగుల్ స్ప్రెడ్ షీట్ లో కూడా అప్డేట్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జీరో డోర్ నంబర్, ఒకే ఇంటిలో పదిమంది కన్నా ఎక్కువ ఓటర్లు ఉన్న ప్రత్యేక దృష్టి సారించి వాటిని సవరించాలని ఆదేశించారు. ఫారం 7,8 లను వినియోగించి తగు విచారణ జరిపి తదనుగుణంగా చర్యలుసుకోవాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో సంయుక్త కలెక్టర్ జే. శివ శ్రీనివాసు, సర్వే అండ్ ల్యాండ్స్ ఎడి రామమోహన్, మండలాల నుండి ఐటిడిఎల ప్రాజెక్ట్ అధికారులు వి. అభిషేక్, సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సాల్, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

కేసులకు భయపడేది లేదు :దొన్నుదొర

ప్రజాశక్తి -అరకులోయ రూరల్:ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పెట్టిస్తున్న అక్రమ కేసులకు భయపడేది లేదని, ప్రజాక్షేత్రంలోనే తేల్చు కుంటామని టిడిపి ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు సివేరి దొన్నుదొర అన్నారు. తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు పై బనాయించిన అక్రమ కేసులు నిరసిస్తూ కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో బుధవారం శ్రేణులతో కలిసి ఆయన పాల్గొన్నారు. చంద్రబాబుని ఎందుకు అరెస్ట్ చేశారో సమాధానం కూడా చెప్పలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు.చంద్రబాబుపై స్కిల్ డెవలప్మెంట్ కేసుకు సంబంధించిన రిమాండ్ రిపోర్టులో డబ్బు ఎవరి ఖాతాలోకి వెళ్లిందో పేర్కొనలేదని తేల్చకుండా ఆయన తప్పు చేశారని ఎలా అంటున్నారో అర్థం కావడంలేదన్నారు. వైసిపి అరాచకాలపై తెలుగుదేశం శ్రేణులంతా ఇంటింటా ప్రచారం చేయాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మాదల సర్పంచ్ శ్రీనివాసరావు, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ భార్య లక్ష్మి, మాజీ సర్పంచ్ జగన్ కుమార్,మాజీ ఎంపీటీసీ కుమార్, పాండారు తులసాజీ, వార్డు మెంబర్ సోనాయ గంగమ్మ తెదేపా నాయకులు పాడి చందు,రాము, సుబ్బారావు బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

దీక్షలో మాట్లాడుతున్న దొన్నుదొర

రోడ్డు నిర్మాణంతో చెలరేగుతున్న దుమ్ము ధూళి

వాహనదారులు సతమతం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: ఎన్‌హెచ్ 516ఈ హైవే రోడ్డు నిర్మాణంలో భాగంగా మండలంలో రోడ్డు పనులు ముమ్మరంగా చేపడుతుండటంతో దుమ్ము ధూళితో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. నిర్మాణం చేపట్టేటప్పుడు దుమ్ము ధూళి ఏర్పడకుండా రోజువారిగా రోడ్డుపై నీళ్లను తడపాల్సి ఉంది. ఆ విధంగా చేపట్టక పోవడంతో నిత్యం వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక మండల కేంద్రంతో పాటు అరకు సంత బయలు వరకు రోడ్డు నిర్మాణం పనులు చేపడుతున్నారు. కొన్నిచోట్ల నిర్మాణం పూర్తికాగా మండల కేంద్రంతో పాటు కురిడి, అరకు సంత బయలులో, మండల కేంద్రం నుంచి చుంచుమండ వరకు ప్రస్తుతం నిర్మాణం పనులు చేపడుతున్నారు. వర్షాలు కురిసే సమయంలో రోడ్లపై దుమ్ము ధూళి ఏర్పడలేదు. అయితే ప్రస్తుతం గత వారం రోజుల నుంచి ఎండలు కాస్తుండటంతో వాహన రాకపోకలతో రోడ్డుపై దుమ్ము ధూళి ఎగసి పడుతుంది. రోడ్డుపై ప్రయాణించేటప్పుడు ద్విచక్ర వాహనాలను దాటుకుని పెద్ద వాహనాలు ఆర్టీసీ బస్సులు, లారీలు, జీపులు వాటిని దాటుకుని వెళ్లే సమయంలో అధికంగా దుమ్ము ధూళి ఎగసి పడుతుండడంతో ద్విచక్ర వాహనదారులు వాహనాలు నడపడానికి పలు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలో రోడ్డుపై వాహనాలు

ఎగురుతున్న దుమ్ము ధూళి

రద్దీగా నడుస్తుండటంతో విపరీతంగా దుమ్ము ధూళి ఏర్పడుతుంది. మండల కేంద్రం కావడంతో వివిధ పనుల నిమిత్తం కార్యాలయాలకు జనాలు ఎక్కువగా వస్తున్నారు. వీరంతా దుమ్ము ధూళితో ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రం వాసులైతే నిత్యం దుమ్ముధూళితో ఇబ్బందులు పడుతున్నామని, దీంతో శ్వాస కోశ వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని మండల వాసులతోపాటు వాహనదారులు కోరుతున్నారు.

ప్రతి ఇంటికీ రక్షిత తాగునీరు : ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి-పాడేరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రతి ఇంటికీ రక్షిత తాగునీరు అందించడమే లక్ష్యంగా జల జీవన్ మిషన్ పథకాన్ని అమలు చేస్తున్నాయని పాడేరు శాసనసభ్యులు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి తెలిపారు. పాడేరు మండలం గుడివాడ గ్రామంలో జల్ జీవన్ మిషన్‌లో భాగంగా రూ.43లక్షలతో ఏర్పాటు చేయనున్న పైపులైన్ల నిర్మాణానికి బుధవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఇప్పుడున్న రెండు లక్షల లీటర్ల సామర్థ్యం ఉన్న ట్యాంకర్లతో లోచలిపుట్టు, గుడివాడ కాలనీలకు 650 ఇళ్లకు నిరంతరాయంగా రక్షిత తాగునీరు సరఫరా చేయనున్నట్లు తెలిపారు. మూడు వాటర్ పంప్స్‌తో ఇప్పుడున్న ట్యాంకులతో పాటు అదనంగా మరో 10 వేల లీటర్ల ట్యాంకు నిర్మించి వాటి నుంచి కుళాయిల ద్వారా అందించేందుకు ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయన్నారు. 650 ఇళ్లకు పైప్ లైన్ల నిర్మాణం జరగబోతుందని, దానికి వార్డు సభ్యుల దగ్గర నుంచి ప్రజలంతా సహకారం అందించాలన్నారు. అధికారులకు, కాంట్రాక్టర్లకు సహకారం అందిస్తే త్వరితగతిన పనులు పూర్తయ్యే అవకాశముందన్నారు. పైప్ లైన్లు కూడా ఎక్కడెక్కడ ఉన్నాయన్న విషయాన్ని స్పష్టంగా తెలిసే విధంగా దిమ్మలు నిర్మించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు కూడా పన్నులు చెల్లించి పంచాయతీలకు సహకారం అందిస్తే వీటి నిర్వహణకు ఆ నిధులను ఉపయోగించేందుకు అవకాశం ఉంటుందన్నారు. పైపులైన్ల నిర్మాణం జరిగిన తర్వాత వాటర్ అండ్ శానిటేషన్ కమిటీని కచ్చితంగా ఏర్పాటు చేసుకోవాలని పంచాయతీ పాలకవర్గానికి ఆమె ఆదేశించారు. వాటర్ సరఫరాకు సంబంధించి నియంత్రణలోనూ నిబంధనల పాటించే విధంగా ఆ కమిటీ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ ప్రాంతానికి తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని అనేకమార్లు తన దృష్టికి తీసుకొచ్చారని నేటితో ఈ సమస్యకు పరిష్కారం లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కొట్టగుల్లి ఉషా రాణి, ఎంపీటీసీ చిట్టెమ్మ, సచివాలయం కన్వీనర్ లకే సత్యవతి, మండల పార్టీ అధ్యక్షులు సీదరి రాంబాబు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మినుముల సరస్వతీ, జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సీదరి మంగ్లన్న, సర్పంచ్ వంతాల రాంబాబు, ఎంపీటీసి నరసింహామూర్తి, సీనియర్ నాయకుడు మినుముల కన్నా పాత్రుడు, బొనంగి రమణ, పద్మ, సోషల్ మీడియా అల్లాడ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆప్ ప్రచారం

ప్రజాశక్తి-డుంబ్రిగూడ:ఆమ్ ఆద్మీ పార్టీ చేపడుతున్న విధి విధానాలపై డుంబ్రిగూడ, అరకులోయ మండలంలోని గ్రామాల్లో బుధవారం ఆ పార్టీ అల్లూరి జిల్లా ఇంచార్జ్ ఎం సుజాత కరపత్రాలను పంచుతూ విస్తతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అవినీతి అక్రమాలకు పాల్పడకుండా ఆమ్ ఆద్మీ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో సుపరిపాలన అందిస్తుందన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలో కొన్ని అసెంబ్లీ స్థానాల్లో గెలిచే విధంగా పార్టీ పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ప్రసాద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంఇఒ పర్యటన

ప్రజాశక్తి- పెదబయలు :స్థానిక గురుకుల బాలుర పాఠశాలలో బుధవారం స్థానిక విద్యాశాఖది కారిణి పుష్పడేవిడ్ తనిఖీలు చేపట్టారు. ప్రాజెక్ట్ వర్క్‌లను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల నుండి ప్రశ్నలకు సమాదానాలు రాబట్టారు. నోట్స్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రిన్సిపాల్ శంకర్‌రావు పాల్గొన్నారు

పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఇఒ

ట్రాన్స్‌ఫార్మర్ నుంచి మంటలు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల 1 ఎదురుగా ఏర్పాటు చేసిన ట్రాన్స్ఫార్మర్ నుంచి బుధవారం ఉదయం 6 గంటల సమయంలో నిప్పులు చెలరేగాయి.స్థానికులు గమనించి తక్షణమే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించారు.స్పందించిన అధికారులు మంటలను అదుపు చేసి విద్యుత్‌ను పునరుద్ధరించారు

చెల రేగుతున్న మంటలు

రోడ్డును పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

రోడ్డు నిర్మించాలి : సిపిఎం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:మండలంలోని గసభ పంచాయతీ చిమిలిగూడ నుండి శిరసగుడ వరకు తారు రోడ్డు నిర్మించాలని సిపిఎం మండల కార్యదర్శి ఎస్బీ పోతురాజు, గసభ మాజీ సర్పంచ్ పాంగి సురేష్ కుమార్ డిమాండ్ చేశారు. ఆ గ్రామాల్లో సిపిఎం నాయకులు బుధవారం సందర్శించి రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, చిమిలిగుడ, సిరసగుడ గ్రామాల్లో సుమారు70కుటుంబాలు ఉండగా 350మంది గిరిజనులు జీవనం సాగిస్తున్నారన్నారు. ఈ గ్రామాలో పివిటిజి కోదు కులస్తులు వ్యవసాయమే ప్రధాన ఆధారంగా జీవనం సాగిస్తున్నారన్నారు. రోడ్డు సౌకర్యం సరిగ్గా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చిమిలిగుడ గ్రామానికి తారు రోడ్డు మంజూరు చేయాలని పలుమార్లు ఎమ్మెల్యేకు, జిల్లా కలెక్టర్, ఐటిడిఎ పీఓ ఇంజనీరింగ్ అధికారులకు విన్నవించినా పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలు అనారోగ్యంతో ఉన్నప్పుడు అంబులెన్స్ గ్రామాల్లో రాక డోలి మెతలో ఆసుపత్రికి తీసుకుని వెళ్ళవలసిన దుస్థితి ఏర్పడుతుందనీ మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు పాంగి సత్యనారాయణ, నాయకులు గెమ్మెలి మోహన్ దాస్, వి.కాంగు, సరుబు తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే మంచి భవిష్యత్తు

- ఐటిడిఎ పిఒ అభిషేక్

ప్రజాశక్తి-పాడేరు:చదువుతోనే గిరిజన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఐటిడిఏ పిఓ వి. అభిషేక్ స్పష్టం చేసారు. విద్యార్థులు ప్రత్యే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పదవ తరగతి విద్యార్థులకు ఇటీవల నిర్వహించిన పరీక్షలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు, తల్లిదండ్రులు, ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో బుధవారం ఐటిడిఏ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దసరా సెలవులు అనంతరం ప్రత్యేక బోధనా తరగతులు నిర్వహిస్తామని చెప్పారు. 117 ఆశ్రమ పాఠశాలల నుండి 30 మంది బాలికలను, 22 మంది బాలురను ప్రత్యేక శిక్షణ కు ఎంపిక చేసామన్నారు. బాలికలకు గుత్తులపుట్టు గిరిజన సంక్షేమ ప్రభుత్వ బాలికల ఆశ్రమ పాఠశాలలోను, దిగు మోదాపుట్టు బాలుర ఆశ్రమ పాఠశాలలోను ప్రత్యేక బోధన అందిస్తామన్నారు. విద్యతోనే గిరిజన కుటుంబాలు అబింబుద్ధి సాధ్యపడుతుందన్నారు. ప్రతీ వారం శిక్షణా తరగతులు పరిశీలిస్తామన్నారు. గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు, ఏటిడబ్ల్యూఓలు సందర్శిస్తారన్నారు. పదికి పది ర్యాంకులు సాధించిన విద్యార్థులకు మారిక వలసలో ఐఐటి, నీట్, శిక్షణ అందిస్తామని పేర్కొన్నారు. వచ్చే ఏడాది నుండి 9వ తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు.తాను మధ్యతరగతి కుటుంబం నుండి వచ్చానని చదువుతోనే తన తలరాత మారిందన్నారు. ప్రతీ విద్యార్థి బాగా చదువు కోవాలని చెప్పారు. అనంతరం విద్యార్థులకు పెన్నులు, చదువే వెలుగు అనే పత్రాలను పంపిణీ చేసారు.ఈ సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఐ.కొండలరావు, ఏడబ్ల్యూఓ ఎల్. రజని, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థుల తల్లి దండ్రులు తదితరులు పాల్గొన్నారు.

నిలిచిపోయిన బస్సు

డొక్కు బస్సులతో ఇక్కట్లు

ప్రజాశక్తి - సీలేరు: ఏజెన్సీ ఘాట్‌రోడ్డులో డొక్కు బస్సులను నడుపుతూ, ప్రజల ప్రాణాలతో విశాఖ డిపో ఆర్‌టిసి అధికారులు చెలగాటమాడుతున్నారని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖపట్నం డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సు విశాఖ నుంచి నర్సీపట్నం చింతపల్లి సీలేరు మీదుగా భద్రాచలం నైట్ సర్వీస్‌గాతిరుగుతున్నాయి. మంగళవారం సాయంత్రం భద్రాచలంలో నైట్‌బస్ సర్వీస్ బయలుదేరి చింతూరు మోతుగూడెం పొల్లూరు మీదగా వస్తుండగా మార్గమధ్యంలో బస్సు ముందు టైర్ పేలిపోయింది. వేరే బస్సు లేకపోవడంతో దాదాపు గంటన్నర పాటు అడవిలో, చిమ్మచీకటిలోసంఘటన ప్రయాణికులు బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీశారు. అనంతరం డ్రైవరు శ్రమించి, వేరే టైర్‌ను అమర్చడం, ప్రయాణికులను సురక్షితంగా గమ్యానికి చేర్చడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఏజెన్సీ వంటి మారుమూల ప్రాంతాలకు, నడిపే నైట్‌బస్ సర్వీసులను కండిషన్ కలిగినవే నడిపే విధంగా ఆర్‌టిసి అధికారులు చర్యలు చేపట్టాలని ప్రయాణికులు డిమాండ్ చేశారు.

పలు రైళ్లు రద్దు, దారి మళ్లింపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : దక్షిణ మధ్య రైల్వేలోని విజయవాడ డివిజన్‌లో భద్రతా పనుల కారణంగా పలు రైళ్లు రద్దయ్యాయని, మరికొన్ని దారి మళ్లించబడ్డాయని రైల్వే శాఖ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎకె.త్రిపాఠి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 22701 విశాఖపట్నం - విజయవాడ ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌ను, 22702 విజయవాడ - విశాఖపట్నం ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌ను అక్టోబర్ 16 నుంచి 21 వరకూ, 17219 మచిలీపట్నం - విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్‌ను అక్టోబర్ 16 నుంచి 22 వరకు, 17220 విశాఖపట్నం - మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్‌ను అక్టోబర్ 17 నుంచి 23 వరకు రద్దు చేశారు. 13351 ధన్‌బాద్ - అలెప్పీ బొకారో ఎక్స్‌ప్రెస్‌ను అక్టోబర్ 15 నుంచి 20 వరకు, 12889 టాటా నగర్ - ఎస్ఎంవి బెంగళూరు ఎక్స్‌ప్రెస్‌ను అక్టోబర్ 20న, 18111 టాటా - యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌ను అక్టోబర్ 19న, 12835 హతియా - ఎస్ఎంవి బెంగళూరు ఎక్స్‌ప్రెస్‌ను అక్టోబర్ 15, 17 తేదీల్లో, 12376 జసిదిహ్ - తాంబరం ఎక్స్‌ప్రెస్‌ను అక్టోబర్ 18న, 22837 హటియా - ఎర్నాకులం ఎసి ఎక్స్‌ప్రెస్‌ను అక్టోబర్ 16న దారి మళ్లించారు. ఆయా రైళ్లు సాధారణ మార్గమైన నిడదవోలు - ఏలూరు - విజయవాడ మీదుగా కాకుండా మళ్లించిన మార్గమైన నిడదవోలు - భీమవరం టౌన్ - గుడివాడ - విజయవాడ మీదుగా నడుస్తాయి. ప్రజలు ఈ మార్పులను గమనించి తదనుగుణంగా వ్యవహరించాలని త్రిపాఠి అభ్యర్థించారు.

ఉపా కేసులపై నిరసన

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటనా స్వేచ్ఛను హరించేలా ప్రజా, పౌర హక్కుల నేతలు, జర్నలిస్టులు, లాయర్లపై అక్రమంగా బనాయించిన ఉపా కేసులను ఉపసంహరించాలని, ఎన్ఐఎ దాడులను ఆపాలని పౌర, ప్రజా, మహిళా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. బుధవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఆయా సంఘాల నేతలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సార్వభౌమ, లౌకిక, గణతంత్ర ప్రజాస్వామిక రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి నిరంకుశ దాడులకు పాల్పడటం దారుణమన్నారు. ఉపా కింద అరెస్ట్ చేసిన వారందరినీ భేషరతుగా విడుదల చేయాలని కోరారు. న్యూస్‌క్లిక్ కార్యాలయంపైనా, పాత్రికేయులపైనా ఢిల్లీ పోలీసులు చేసిన దాడిని ఖండించారు. కార్యక్రమంలో నాయకులు పి.చంద్రశేఖర్, ఎం.లక్ష్మి, వెంకటలక్ష్మి, అనురాధ, డి.లలిత, పద్మ, అన్నపూర్ణ, బి.వెంకటరావు, సలీం, సీతారాం, గోవింద్, నాగభూషణం, శ్రీను, అప్పలరాజు, ఎస్.సూరప్పడు, ఎస్‌కె.రెహమాన్, రవి పాల్గొన్నారు

విద్యుత్ లేక తాగునీటికి ఇక్కట్లు

చోరీకి గురైన సౌరవిద్యుత్ బ్యాటరీలు - శిథిలమైన బోరు నీటితోనే జీవనం
ఆందోళన చెందుతున్న గిరిజనులు - అధికారుల నిర్లక్ష్యంపై మన్యవాసుల ఆగ్రహం

ప్రజాశక్తి - సీలేరు: జీకే వీధి మండలం గుమ్మరేవుల పంచాయతీ పరమసింగవరం గ్రామంలో విద్యుత్తు సరఫరా లేక తాగునీటికి గిరిజనులు కటకట లాడుతున్నారు.కాలువల్లోని బురదనీరు, గెడ్డల్లోని ఊటనీటిని వినియోగించాల్సిన దుస్థితి ఉందని వాపోతున్నారు. పరమసింగవరం గ్రామంలో నెలకొన్న సమస్యలపై ఏ అధికారి పట్టించుకోవడం లేదని గిరిజనులు వాపోయారు. గ్రామంలో విద్యుత్ సౌకర్యం కల్పనకు సోలార్ యూనిట్‌ను ఏరాపటు చేసినప్పటికీ, దాని బ్యాటరీలో చోరీకి గురికావడంతో ఈ దుస్థితి దాపురించిందని అంటున్నారు.. గ్రామంలో మంచినీరు అందించేందుకు ఇంటింటికీ కుళాయిల ఏర్పాటుక పైపులైన్లు ఏర్పాటు, ట్యాంక్‌నిర్మాణం వంటి చర్యలు చేపట్టడం లేదని అంటున్నారు. గ్రామంలో ఉన్న ఒకబోరు నుంచి కొద్దికొద్దిగానే నీరు వస్తోందని, అక్కడ బోరు ప్లాట్‌పాం శిథిలావస్థకు చేరడంతో బోరులోంచి వచ్చే నీరు కలుషితమౌతుండడం, దాన్ని ఎవరూ పట్టించుకోక పోవడంతో స్థానికులే రాళ్లతో తాత్కాలిక ప్లాట్‌పాం ఏర్పాటు చేశామన్నారు. మంచినీటి సౌకర్యం కల్పించడంలో పంచాయతీ సర్పంచ్, యంత్రాంగా ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ శివారున ఉన్న చిన్నపాటి కాల్వలో నీరు వాడుతున్నామని, కలుషిత నీటి వల్ల ఎటువంటి రోగాలు వస్తాయోనని ఆందోళన చెందుతున్నారు పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలకైనా తాగునీరు

పాడైన బోరు వద్ద బిందెడు నీటి కోసం గిరిజనుల పాట్లు

విద్యుత్ సౌకర్యాలు అధికారులు కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో చీకట్లో తాము జీవనం కొనసాగిస్తున్నామని రాత్రివేళ క్రిమి కీటకాలు విషపూరితమైన పాములు కాటు వేస్తే తమ ప్రాణాలు గాల్లో కలిసిపోవాల్సిందేనని గిరిజనుల ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు తక్షణమే స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరారు.

33/11 కెవి స్థానంలో..

త్వరలో ఆటోమేటెడ్ కంటైనర్ సబ్‌స్టేషన్లు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

నిరంతరాయ విద్యుత్ సరఫరాకు ఎపిఇపిడిసిఎల్ ఇంజినీరింగ్, సాంకేతిక విభాగ అధికారులు తీవ్ర కృషి చేస్తున్నారు. సరికొత్త టెక్నాలజీతో రూపొందిన ఆటోమేటెడ్ కంటైనర్ సబ్‌స్టేషన్లను ప్రవేశపెట్టబోతున్నారు. 33/11 కెవి స్టేషన్లలో కరెంట్ ట్రిప్ అయితే క్షణాల్లో విద్యుత్ ఆన్ అయిపోయే వ్యవస్థ ఈ ఆటోమేటెడ్ టెక్నాలజీ. సూపర్‌వైజరీ కంట్రోల్ అండ్ డేటా అక్విజిషన్ (స్కాడా ఆధారిత) సాఫ్ట్‌వేర్ ద్వారా ఇది పనిచేస్తుంది. ఇప్పటికే విశాఖలోని అవుటర్ హార్బర్‌లోని 33 కెవి సబ్‌స్టేషన్‌లో పైలట్ ప్రాజెక్టుగా ట్రయల్ రన్ అమలు చేశారు. తర్వాత రుషికొండలో యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు చేసే దిశగా ఎపిఇపిడిసిఎల్ యంత్రాంగం కదులుతోంది. ముఖ్యంగా ఎపిలో తొలిసారి విశాఖ సర్కిల్ పరిధిలో 33/11 కెవి సబ్‌స్టేషన్ల స్థానంలో అత్యాధునిక ఆటోమేటెడ్ సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు రంగం సిద్ధం చేస్తున్నారు. అదనపు వ్యయాభారం కూడా దీనికి ఉండదని ఇంజినీర్లు చెబుతున్నారు. పాత సబ్‌స్టేషన్లనే కన్వర్షన్ మోడ్‌లోకి తేనున్నారు. ఇప్పటివరకూ అధిక వర్షాలు, ప్రకృతి వైపరీత్యాలు, ఎండాకాలం, ఇతరత్రా సమస్యల కారణంగా 33/11 కెవి సబ్‌స్టేషన్లలో లోడ్ అధికమై ప్రమాదాలు తలెత్తి విద్యుత్‌కు అవస్థలు పడే పరిస్థితులున్నాయి. వీటన్నిటికీ చెక్ పెట్టేలాగ ఆటోమేటెడ్ సబ్‌స్టేషన్లను అండర్ గ్రౌండ్ విద్యుత్ లైన్లు ఉన్న పలు చోట్ల పెట్టే దిశగా రాష్ట్ర విద్యుత్ శాఖ అడుగులు వేస్తున్నట్లు ఎపిఇపిడిసిఎల్‌కు చెందిన ఉన్నతాధికారులు తాజాగా 'ప్రజాశక్తి'కి వివరించారు.

కోస్తా తీరానికే తొలి ప్రాధాన్యత

ఆంధ్రప్రదేశ్ ఎనర్జీ శాఖ ప్రతిపాదనల ప్రకారం ఆటోమేటెడ్ సబ్‌స్టేషన్లను కోస్తా తీరం వెంబడి పెట్టేందుకు రంగం సిద్ధమవుతోంది. ఈ దసరాకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి క్యాంపు ఆఫీసు రుషికొండలో ఏర్పాటు చేసే దిశగా పనులు చకచకా సాగుతున్నాయి. అక్కడ భవనాలూ సిద్ధమయ్యాయి. కొండపైకి వెళ్లే దారిలో ఇరువైపులా పూలమొక్కలనూ సిద్ధం చేశారు. ప్రస్తుతం రుషికొండ సబ్‌స్టేషన్ పరిధిలో రెండు వేల మంది వినియోగదారులున్నారు. ఈ సబ్‌స్టేషన్‌ను ఆటోమేటెడ్ సబ్‌స్టేషన్‌గా మారుస్తున్నారు. విద్యుత్ అంతరాయం లేకుండా పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 15కే అది సిద్ధం కానుంది.

హార్బర్ ఏరియాలో
పైలట్ ప్రాజెక్టు

హార్బర్ ఏరియాలో తొమ్మిది వేల మంది వినియోగదారులు సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్నారు. ఈ హార్బర్ సబ్‌స్టేషన్ పరిధిలో విశాఖ టెర్మినల్ కంటైనర్ కార్పొరేషన్ (విసిటిపిఎల్) ఉంది. దీంతో అధిక లోడ్ ఈ స్టేషన్‌పై పడుతోందని అధికారులు చెబుతున్నారు. దీన్ని అధిగమించేందుకు ఇప్పటికే కంటైనర్ ఆటోమేటెడ్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేశారు. ఈ సబ్‌స్టేషన్‌ను ఆటోమేటెడ్ చేయడం వల్ల కెజిహెచ్ పరిసర ప్రాంతాలు, పాండురంగాపురం, టౌన్ కొత్తరోడ్డు పరిధిలోగల 30 వేల మంది వినియోగదారులకు లబ్ధి చేకూరే అవకాశాలున్నాయని ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు.

మాట్లాడుతున్న ఎడిఎంహెచ్‌ఒ ప్రకాష్

గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన

ప్రజాశక్తి - రంపచోడవరం : అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా స్థానిక రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీ విద్యార్థినులకు బుధవారం పిసిపిఎన్‌డిటి, గుడ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అడిషనల్ డిఎంహెచ్‌ఒ, రంప చోడవరం డాక్టర్ జి ప్రకాష్ మాట్లాడుతూ బాలికలు మంచి క్రమశిక్షణతో చదువుకుంటూ ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆకాంక్షించారు. వ్యక్తిగత పరిశుభ్రత, మంచి ఆహారపు అలవాట్లు అలవరచుకోవాలని, రక్తహీనత నివారణకు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని, గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించారు. గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం, ఫలితాలను అడగడం, ఇవ్వడం చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో పెద్దగద్దాడ వైద్యాధికారి డాక్టర్ వినోద్ కుమార్, కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ అడిషనల్ డిఎంహెచ్‌ఓ కార్యాలయ ఎంపిహెచ్‌ఓ మూర్తి ఎంపిహెచ్ఎస్ ఎఫ్ సిహెచ్‌వి సీతాయమ్మ ఎఎన్ఎం మంగతాయారు, వరలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పి సునీత, హెల్త్ అసిస్టెంట్ వై చిన్నారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాల మైదానంలోని హెలీప్యాడ్ తొలగించాలి

ప్రజాశక్తి- చింతూరు : స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల క్రీడామైదానంలో చాన్నాళ్ల క్రితం నిర్మించిన హెలిప్యాడ్‌ను తొలగించాలని ఎఎస్ఆర్ టీం అధ్యక్షులు పూనం కిరణ్‌కుమార్, కార్యదర్శి వైస్ ప్రెసిడెంట్ ఎడమ అర్జున్. ట్రెజరర్ బొగ్గ కోటి బంగార్రాజు, రాజ్ కుమార్ తదితరులు ఐటిడిఎ పిఒకు వినతిపత్రం అందజేశారు. పాఠశాల మైదానం మధ్యలో హెలిప్యాడ్ ఉండటంతో ఆటగాళ్ళకు గాయాలవడంతో పాటు, ఆటలకు కూడా ఆటంకం కలుగుతోందన్నారు. ఈ నేపథ్యంలో కొన్నాళ్లుగా నిరుపయోగంగా ఉన్న హెలీప్యాడ్‌ను తొలగించాలని కోరారు.

విద్యార్థికి అభినందన

ప్రజాశక్తి - రంపచోడవరం : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో వైఎస్ఆర్ కడప జిల్లా, మైదుకూరులో జరిగిన అండర్ -17 బాల బాలికల రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల వాలీబాల్ ఎంపిక పోటీలలో ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాల, రంపచోడవరం విద్యార్థి మిరియాల వీర వెంకటసాయి ప్రసాద్‌దొర పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టిసిపేషన్ సర్టిఫికెట్‌ను ప్రదానం చేశారు. రాష్ట్రస్థాయి ఎంపికపోటీల్లో పాల్గొన్న విద్యార్థి వెంకటసాయిని హెచ్ఎం డిఎఫ్ ప్రేమకుమార్, ఉపాధ్యాయులు పి. చిన్నారావు, పి. బుల్లయ్య, పి. అర్జునుడు,పి. దుర్గారావు, కె. రాంబాబు, బి.రాంబాబు, గి. ధరణీధర్,యు.సుగంధ రెడ్డి,బి.రమేష్,కె.బి.రణదీప్ దొర, జి.సత్యనారాయణ రెడ్డి, పి.సోమేశ్వర బాబు అభినందించారు. కార్యక్రమంలో పీడీ కంగల పోతురాజు, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రోడ్డు భద్రతా నియమాలపై ఎంవిపి పోలీస్ స్టేషన్ పరిధిలోని మద్దిలపాలెం నాలుగు రోడ్ల కూడలి వద్ద బుధవారం అవగాహన కల్పించారు. వీడియోలను ప్లే చేస్తూ సుప్రా వాహనంపై ఈ కార్యక్రమం చేపట్టారు. ఎంవిపి శాంతి భద్రతల సిఐ మల్లేశ్వరరావు, ట్రాఫిక్ ఎస్ఐ వి.కనకారావు పాల్గొన్నారు.

బజాజ్ కొనుగోళ్లపై ఆఫర్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వరుణ్ బజాజ్ 31వ వార్షికోత్సవ, దసరా సంబరాల్లో భాగంగా ప్రతి బజాజ్ కొనుగోలుపై రూ.6500 క్యాష్ డిస్కౌంట్ అందిస్తున్నామని వరుణ్ బజాజ్ సిఇఒ శ్రీనివాస్ తెలిపారు. అంతేకాకుండా 90 శాతం వరకు ఫైనాన్సు సౌలభ్యంతో పాటు పాత టూ వీలర్ ఎక్స్ఛేంజ్‌లో మార్కెట్ ధర కంటే రూ.7500 ఎక్స్ఛేంజ్ ధర కూడా అందిస్తున్నామని తెలిపారు. ఈ ఆఫర్లు నగరంలోని సిరిపురం, మధురవాడ, ఇసుకతోట శాఖల్లో అందుబాటులో ఉన్నాయని చెప్పారు.